క్లుప్తంగా

పింఛన్ కోసం దివ్యాంగుడి అగచాట్లు



పింఛన్ కోసం ఎర్రటి ఎండలో వచ్చిన హనుమంతప్ప

రొద్దం: వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్లు పంపిణీ ఆగిపోవడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం పాతర్లపల్లికి చెందిన హనుమంతప్ప అనే దివ్యాంగుడు సచివాలయం-3 వద్దకు పింఛన్ కోసం 6 కిలో మీటర్ల మండిపోతున్న ఎర్రటి ఎండలో ఒక కాలినడకన వచ్చాడు. తీరా సచివాలయం వద్దకు రాగానే సెలవు అని తెలియడంతో ఆవేదనకు గురయ్యాడు. ఈసందర్భంగా అతడు మాట్లాడుతూ చంద్రబాబు, నిమ్మగడ్డ ప్రసాద్ చేసిన నిర్వాకంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. చంద్రబాబుకి వికలాంగులు, వితంతువులు, వృద్ధుల శాపం, తమ ఉసురు తగిలి నాశనమై పోవడం ఖాయమన్నారు. చేతగానికి వారిని ఇంత కష్టాలకు గురి చేయడం పద్ధతి కాదన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

అమరాపురం: మండలంలో శుక్రవారం నాటికి 94 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. మొత్తం 8780 మందికిగాను 8201 మందికి పింఛన్ సొమ్ము అందించామన్నారు. మిగతా పింఛన్లను సచివాలయం సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

సోషల్ మీడియా పనితీరు భేష్



సోషల్ మీడియా సభ్యులను అభినందిస్తున్న శివకుమార్

మడకశిర: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు,కో కన్వీనర్ల పనితీరు భేషుగ్గా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీశివకుమార్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గస్థాయి సోషల్ మీడియా కన్వీనర్లు, కోకన్వీనర్ల సమావేశం జరిగింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో సోషల్ మీడియా సభ్యులు ముందున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తకు బెదిరింపులు

పరిగి: మండల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త మున్నా అలియాస్ జియావుల్లాను హతమారుస్తామంటూ టీడీపీ అల్లరి మూకలు బెదిరించాయి. బాధితుడు తెలిపిన మేరకు... వైఎస్సార్‌సీపీలో సోషల్ మీడియా వింగ్‌లో మున్నా కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం కొందరు టీడీపీ నాయకులు ఆయనకు ఫోన్ చేసి సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టులు పెట్టినా హతమారుస్తామని బెదిరించారు. ఈ అంశాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లి, తనకు ఫోన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, నాయకులు సింగారెడ్డి, చంద్రారెడ్డి, ఎంపీటీసీ మారుతీరెడ్డి, గిరి ఉన్నారు.

లారీ బోల్తా

పెనుకొండ రూరల్: కియా సమీపంలో శుక్రవారం 44వ జాతీయ రహదారిపై లారీ అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఢిల్లీ నుంచి బెంగళూరు వెళుతున్న లారీ గురువారం రాత్రి కియా మెయిన్ గేట్ సమీపంలో మరో లారీని ఓవర్ టాక్ చేయబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఎవరికీ హాని జరగలేదు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



నామినేషన్ దాఖలు చేస్తున్న గోవింద కారజోళ

పావగడ: చిత్రదుర్గం లోక్ సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. బీజేపీ జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి మాజీ ఉప ముఖ్యమంత్రి గోవింద కారజోళ, కాంగ్రెస్ అభ్యర్థి బీఎన్ చంద్రప్ప నామినేషన్ వేశారు. మొత్తం 28 మంది స్వతంత్ర్య అభ్యర్థులు 36 సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందించారు. గోవింద కారజోళ, చంద్రప్ప మధ్యే గట్టి పోటీ నెలకొంది. అయితే చిత్రదుర్గం పార్లమెంట్ నియోజక వర్గంలో 8 అసెంబ్లీ స్థానాలుండగా వీటిలో 7 స్థానాలు కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి సులభంగా గెలిచే అవకాశాలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ హవా, నరేంద్ర మోదీ చరిష్మాతో ఎన్డీఏ అభ్యర్థి గోవింద కారజోళ తప్పక విజయం సాధిస్తాడని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్

హిందూపురం: స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్‌సీపీ హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి టీఎన్.దీపిక, పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ అన్నారు. డాక్టర్ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రాం, డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక రైల్వేరోడ్డులోని అంబేడ్కర్ భవన్ వద్ద బాబు జగ్జీవన్ రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడారన్నారు. జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరలేనివన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, టీఎన్ దీపిక, నాయకులు



జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్ రామ్

పెనుకొండ: మాజీ దేశ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆదర్శప్రాయుడని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖామాత్యులు ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలలు, కౌన్సిలర్లతో కలసి బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు సుధాకర రెడ్డి, సద్దాం, రామాంజనేయులు, రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, రామాంజనేయులు, మారుతి, గుట్టూరు అంజినేయులు, కొండలరాయుడు, బోయ బాబు, సిక్బతుల్లా, నేమతుల్లా, షామీర్, యాసిన్, ఫరీద్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో..

పట్టణంలో శుక్రవారం దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగాఎమ్మార్పీఎస్, మాలమహానాడు, దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. నాయకులు రామాంజనేయులు, ఎంఎన్.మూర్తి, న్యాయవాది శివరామకృష్ణ, వెంకటేశులు, రవి, నరసింహులు, ఈశ్వర్, మారుతి, హంటర్ ప్రసాద్, బతకప్పగారి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

దళిత బాంధవుడు జగ్జీవన్‌రామ్

మడకశిర: దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ దళిత బాంధవుడని వైఎస్సార్‌సీపీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈరలక్కప్పతో పాటు నాయకులు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ దేశానికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎన్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీశివకుమార్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్ నాగేంద్ర, కోఆప్షన్ సభ్యుడు ఫకృద్దీన్, బీసీ సెల్ కార్యదర్శి శ్రీరాములు, పట్టణ నాయకుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చరణ్‌రెడ్డి, నాయకులు

రేపు నియోజకవర్గ వ్యాప్తంగా బైక్ ర్యాలీ

- మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నియోజకవర్గవ్యాప్తంగా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప ఓ ప్రకటనలో తెలిపారు. బైక్ ర్యాలీ ఉదయం 8 గంటలకు మడకశిర పట్టణంలోని పావగడ రోడ్డులో ఉన్న శివాలయం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మడకశిరలో ప్రారంభమై అమరాపురం, గుడిబండ, రొళ్ల మీదుగా వెళ్లి అగళి మండలంలో ముగిస్తుందని తెలిపారు. బైక్‌ర్యాలీ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

మడకశిరరూరల్: ఆమిదాలగొంది, ఛత్రం పంచాయతీల్లో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మండల బూత్ కమిటీ కన్వీనర్ జమ్మానిపల్లి మూర్తి, ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపల్లి నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి



నడింపల్లిలో టీడీపీ కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్రస్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె నడింపల్లిలోని పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన 58 నెలల పాలనలో 99.5 శాతం హామీలు నెరవేర్చారన్నారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ మేలు జరిగిందని దీనిపై ఇంటింటా వివరించాలన్నారు. జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, స్థానిక నాయకులు పోలేపల్లి నర్సింహులు, మురళి, జయచంద్రరెడ్డి, శ్రీరాములు, మంజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 230 కుటుంబాల చేరిక

మండల వ్యాప్తంగా 230 టీడీపీ కుటుంబాలు శుక్రవారం రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. నాగినాయని చెరువు, గుడిపల్లి, పందిపర్తి, చాలకూరు, నడింపల్లి, మండ్లి, చల్లాపల్లి, మాగేచెరువు, తుంగోడు పంచాయతీలో మంత్రి పర్యటించారు. ఆయా పంచాయతీలలో టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మంత్రి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో తనను గెలిపించాలని, ప్రతి ఒక్కరినీ గుర్తిస్తానని ఆమె తెలిపారు. ఎస్సీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర, సేవాదళ్ చైర్మన్ వేణు, నాయకులు లక్ష్మీనరసప్ప, నాగరాజు రావు, శ్రీనివాస రెడ్డి, నరసింహమూర్తి, ఈశ్వర్, దాము, రాజశేఖర్ రెడ్డి, కళ్యాణ్, బాబు, జగదీష్, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

హిందూపురం: వేసవి నేపథ్యంలో హిందూపురం సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. హిందూపురం సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో 16 చోట్ల చలివేంద్రాలు ప్రారంభించినట్లు సేవాసమితి అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. 11 ఏళ్లుగా పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తాలూకా పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బంది, త్యాగరాజు నగర్ శివాలయం వద్ద నూతన వధువు, ఆర్టీసీ బస్టాండు వద్ద డీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు మహేష్ కుమార్, జగదీష్, మంజు, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఆఫీసు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

నేడు బిసలమానేపల్లిలో ప్రచారం

లేపాక్షి: బిసలమానేపల్లి, వెంకటాపురం, ఓబుళాపురం, రాజీవ్‌కాలనీ నందు శనివారం ఉదయం 7 గంటలకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయశాంతమ్మ, టీఎస్ దీపిక ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

జగనన్నకు మరోసారి పట్టం కట్టండి





ఫ్యాను గుర్తుకే ఓటేయాలని కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప . ఈరలక్కప్పకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: పైసా అవినీతికి తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రజలను కోరారు. కొంకల్లు, ఎస్ రాయాపురం, మేకలఘట్ట, ఎస్ఎస్ గుండ్లు స్థానిక సర్పంచ్ కవిత ఓబన్న, హులిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అయా గ్రామాల్లో ప్రజలు ఆయనకు అడుగడునా నీరాజనం పలికారు. తొలుత వాల్మీకి విగ్రహానికి పూల మాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ముకుమ్మడిగా జగనన్న చేస్తున్న సంక్షేమాన్ని అడ్డుకోవడానికి కుటిల ప్రయత్నం చేస్తున్నారని, ఇంటికొచ్చే పింఛన్ అడ్డుకున్నారని ఈరలక్కప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు ఉసురు ఊరికే పోదన్నారు. ఇలాంటి పచ్చ పార్టీకి బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. అందుకే రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం సమస్థాయిలో అందించి బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి జగనన్నే అని మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన, సంయుక్త జీబీ శివకుమార్, రంగేగౌడ్, డైరెక్టర్ నేత్రావతి, జెడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు, మండల కన్వీనర్లు అమరాపురం త్రిలోక్, రొళ్ల నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కొంకల్లు శివకుమార్, ఎంపీటీసీలు పాతలింగప్ప, రత్నమ్మ, సర్పంచులు కరుణాకర్‌గౌడ్, అశ్వత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

రొద్దం: రాచూరు, రాగిమేకులపల్లి, కొత్తూరు, ఆర్ కుర్లపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం 4 గంటలకు మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పర్యటించనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

విద్యతో బంగారు భవిష్యత్

రొళ్ల: విద్యతో బంగారు భవిష్యత్తు సాధ్యమని జెడ్పీటీసీ ఆనంతరాజు పేర్కొన్నారు. పట్టణంలోని మారుతి కాలనీలో బాలాజీ రూరల్ అప్పర్ ప్రైమర్ ప్రాథమిక పాఠశాల 20వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కైవల్యానంద సరస్వతి స్వామిజీ, చిదానందభారతి స్వామిజీ, మడివాళ బసవమాచిదేవస్వామిజీ హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ రామలక్ష్మమ్మ, పాఠశాల నిర్వాహకుడు శివలింగప్ప, ఏఓ శశికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందాం

- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, బోయ శాంతమ్మ, టీఎన్ దీపిక

లేపాక్షి: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయడం ద్వారా సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, టీఎన్ దీపిక ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం మండలంలోని శిరివరం, గోపిందేవరపల్లి, తిరుమలదేవరపల్లిలో వారు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గోపిందేవరపల్లిలోని తొలిశమ్మ అమ్మవారికి పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలను అందించి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తెలియజేశారు. అనంతరం శిరివరంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి ప్రజలే రథసారథులని, మీరందరూ రథసారథులుగా ఉండి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులు ఈ రాష్ట్రంలో పనిచేయవని తెలిపారు. ప్రతి నెలా 1న ఉదయం అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు జగనన్న వలంటీర్ల ద్వారా పింఛన్ అందించేవారన్నారు. వలంటీర్లతో ప్రభుత్వానికి మంచిపేరు రావడాన్ని సహించలేని చంద్రబాబు నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేశారన్నారు. జగనన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా మహిళలకు అవకాశం కల్పించడం ద్వారా మహిళలకు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి, మండల అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ నేత్రావతి, మాజీ ఎంపీపీ హనోక్, లేపాక్షి, కోడిపల్లి సర్పంచ్‌లు ఆదినారాయణ, మంజునాథ్, చలపతి, స్థానిక నాయకులు మంజునాథ్, అశ్వత్థప్ప, బాలు, చంద్రశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, మూర్తి, ఫారూఖ్, ఇంతియాజ్, కిష్టప్ప, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న అభ్యర్థులు బోయ శాంతమ్మ, టీఎన్ దీపిక, జెడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు గిరిజమ్మ, ఇంద్రజ

చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది

హిందూపురం: చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకొని వృద్ధులు, దివ్యాంగులపై కక్ష తీర్చుకుంటున్నాడని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక అన్నారు. శుక్రవారం ఆమె తూముకుంట పంచాయతీలో నియోజకవర్గ నేత మధుమతి రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆమె ఇంటింటికీ తిరిగి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. చుట్టపుచూపుగా వచ్చే వ్యక్తి ఎమ్మెల్యేగా పనికిరారని, తాను ఇక్కడే ఉండి సేవ చేస్తానన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. నాయకులు శ్రీరామరెడ్డి, షమీమ్‌తాజ్ పాల్గొన్నారు.

అల్లా అందరినీ ఆశీర్వదించాలి



పెనుకొండలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న అభ్యర్థులు టిఎన్.దీపిక, శాంతమ్మ



ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న ఈరలక్కప్ప, నాయకులు

పెనుకొండ: ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖామాత్యులు, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ కోరారు. పట్టణంలోని దర్గారోడ్డులో శుక్రవారం రాత్రి మంత్రి ముస్లింలకు భారీ ఎత్తున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలతో కలిసి సీఎం వైఎస్‌జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ముస్లింలకు స్వయంగా భోజనం వడ్డించారు. మంత్రి చరణ్‌రెడ్డి ఇఫ్తార్ విందు ముగిసే వరకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, ఏజీపీ భాస్కరరెడ్డి, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్లు తయూబ్, సద్దాం, సుధాకరరెడ్డి, రఘునాథరెడ్డి, శేషాద్రి, రామాంజనేయులు, భాస్కర్‌నాయక్, ఫరీద్, యాసిన్, సిక్బతుల్లా, గణేష్, క్రిష్టప్ప, నేమతుల్లా, రాము, మారుతి, షామీర్, ఖాజాపీర్, గుట్టూరు అంజినేయులు, రాజశేఖరరెడ్డి, సుగుణాకరరెడ్డి ,కొండలరాయుడు, కిరణ్, శ్రీరాములు, ఇర్షాద్, ఇస్మాయిల్‌సాబ్, గోపాలరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

సోమందేపల్లి: గోరంట్లలోని జామియా మసీదు వద్ద శుక్రవారం రాత్రి ముస్లింలకు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు ముగిసిన అనంతరం ముస్లింలకు విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్ష ఉన్నవారికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు చరణ్‌రెడ్డి భోజనాన్ని వడ్డించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు లక్ష్మీనరసప్ప, ధనుంజయ రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు బాషా, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్, మైనార్టీ నాయకులు నూర్, హిదాయతుల్లా, సుభాన్, బాబా వలి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: అల్లా అందరినీ ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు టీఎన్. దీపిక, బోయ శాంతమ్మ అన్నారు. స్థానిక అల్ హిలాల్ ఫంక్షన్ మైదానంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దీపిక, శాంతమ్మతోపాటు నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబీవుల్లా వైఎస్సార్‌సీపీనేత మధుమతిరెడ్డి ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు ముస్లింలకు స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ముతవల్లీలు, మౌలానాలు, ముస్లిం మత పెద్దలు, కౌన్సిలర్లు, ముస్లింలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని కొత్త మసీదులో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, నాయకులు మసీదులో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఈరలక్కప్ప ముస్లింలకు స్వయంగా భోజనం వడ్డించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎన్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీశివకుమార్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జిల్లా బీసీ కమిటీ సభ్యుడు శ్రీరాములు, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణ, కౌన్సిలర్లు అన్సర్, నాగేంద్ర, మైనార్టీ నాయకులు అక్రమ్, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అమరాపురం: మద్దనకుంట చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ జనార్ధన నాయుడు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. కర్ణాటక సరిహద్దులో కావడంతో డబ్బు, మద్యం అక్రమంగా తరలించకుండా వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు.